మహాభారతంలో యక్షప్రశ్నలు

PARA ASHOKKUMAR

మహాభారతములోని

యక్షప్రశ్నలు

రచన:

పెమ్మరాజు భానుమూర్తి

ప్రచురణ:

వెంకటేశ్వర పబ్లిషింగ్ హౌస్

శివశంకరపురం కృష్ణలంక, : : విజయవాడ-1.

ప్రథమ ముద్రణ
జులై 1976
హక్కులు ప్రకాశకులవి

వెల 3-00

శ్రీ వెంకటేశ్వర ప్రింటింగ్ వర్క్సు, విజయవాడ-2.

పూర్వగాధ

పాండవులు వనవాసం చేస్తున్న సమయంలో జరిగిన ఘట్టం యిది. కురుచక్రవర్తి దుర్యోధనునితో జూదమాడాడు ధర్మరాజు. ఆ జూదంలో సమస్తాన్ని పోగొట్టుకున్నాడు. చివరకు తనను తన భార్యను, తమ్ములనుకూడా ఒడ్డి ఓడిపోయాడు. తన రాజ్యాన్ని పోగొట్టుకోవడమేగాక తన తమ్ములతో ఒక ఏడాది అజ్ఞాతవాసము, పదునాలుగు సంవత్సరాలు అరణ్యవాసముకూడా చేయవలసి వచ్చింది.

ఇది పూర్వకథ. యిది మహాభారతము. అరణ్యపర్వంలో విశదీకరించబడింది. ఆ సమయంలో యుధిష్టరుడు ఎందరో మహర్షులను, మహాపండితులను కలసికొన్నాడు. వారివలన ఎన్నో విషయాలు తెలిసికొన్నాడు.

పాండవులు ద్వైతవనాన్ని తమనివాసస్థానంగా ఎంచుకొన్నారు. క్కడే పదునాలుగు సంవత్సరాలు గడిపివేయాలన్నది వారి ఆకాంక్ష. అందుకు కారణంకూడా వుంది. ఆ వనంలో ఎందరో మహర్షులు, మహాజ్ఞానులు నివసిస్తున్నారు. వారి సహచర్యంలో, స్నేహంలో, సేవలో, పదునాలుగు వత్సరములు గడచిపోవడమేగాక తమ తమ జీవితాలుకూడా సార్థకత చెందుతాయని వారు ఎంచారు.

ఈ విధంగా ప్రశాంతంగా కొన్నిరోజులు గడిచిపోయాయి. ఒకనాడు ఒక విచిత్రమయిన సంఘటన జరిగింది.

పాండవుల నివాసానికి అతిదగ్గరలో ఒక బ్రాహ్మణు డున్నాడు. అతను ఉత్తముడు. సర్వసంగపరిత్యాగి. భగవ న్నామ స్మరణలో జీవితాన్ని వెళ్ళబుచ్చుతున్న సాధువు.

ఆ బ్రాహ్మణుడు ఆరణిపుల్లలను ఆరబెట్టుకున్నాడు. ఆరణిపుల్లలు నిప్పుచేసికోవడానికి ఉపయోగపడతాయి. వాటిని ఆరబెట్టి అతడు తన నిత్యకృత్యంలో మునిగిపో యాడు. ఒక జింక ఆతడు ఆచోటలేని సమయంలో ఆ పుల్లలను నోటకరచుకొని పరిగెత్తింది. ఎంతో కష్టపడి సంపాదించిన పుల్లలు అవి. నిష్కారణంగా జింక పాలవడం చూచాడు. సహించలేకపోయాడు. సహించలేకపోయినా ఏమీ చేయలేకపోయాడు.

త్వరితగతిని పాండవుల నివాసస్థానానికి వెళ్ళాడు. వారికి ఈ విషయం చెప్పాడు.

"యుధిష్ఠర మహారాజా! అల్పులను బలహీనులను బ్రాహ్మణులను, స్త్రీలను, బాలురను కాపాడవలసిన బాధ్యత క్షత్రియులది. కాగా నీవు ధర్మమూర్తివి. నన్ను కాపాడి, నా వస్తువును నాకు అప్పగించగలవన్న ఆశతో నీవద్దకు వచ్చాను".

ధర్మరాజు పరోపకారి. బ్రాహ్మణుని మాటలు విన్నాడు. వెంటనే తమ్ములు వెంటరాగా జింకకోసం బయలుదేరాడు. ఉదయం ప్రారంభమైన వారి గాలింపు మధ్యాహ్నం వరకూ జరిగింది. కాని అందువలన ఎటువంటి

ప్రయోజనమూ కలుగలేదు సరికదా జింక జాడకూడ తెలియలేదు.

మధ్యందిన భానుమండలం నుంచివచ్చే కిరణాల వేడి, విపరీతమైన దప్పిక, ఆకలి యివిగాక జింక కన్పించకపోవ డం, వారిని ఎంతో బాధించాయి.

దగ్గరలో వారికి ఒక మహావృక్షం కన్పించింది. ఆ మర్రిచెట్టు నీడను ఒకింతసేపు విశ్రాంతి తీసుకుందామని ఎంచి ఆ చెట్టుదగ్గరకు వెళ్ళారు.

ఆ చెట్టునీడన కొంత సేదతీరారు. వారిలో వారు ఈ విధంగా అనుకున్నారు.

"మనం యిన్నివిధాలుగా బాధలు పడుతున్నాం - ఇన్ని కష్టాలు పడుతున్నాం - కాని లాభంలేకుండా వుంది. లోకంలో ధర్మాన్ని తూచతప్పకుండా అనుసరించుతూ వున్నా, నీతి నియమాలకోసం: పరోపకారంకోసం ప్రాకు లాడుతూవున్నా ప్రయోజనం లేకుండావుంది. ప్రపంచంలో వుండే బాధలు, వ్యధలు అన్ని మనకే అంకితమైనటు న్నాయి—" అన్నాడు పాండవులలో ఒకడైన నకులుడు.

అందుకు ధర్మరాజు.

"ధర్మం అంటే వేరేలేదు— మనం చేయవలసినదే మన ధర్మం— లాభము, నష్టము, సుఖము, దుఃఖము తప్పవు మరి—" అన్నాడు.

"ఎందుకు తప్పవు— మాబాగా తప్పుతాయి. ఆ నాడే తప్పిపోయివుండేవి. మీరూరుకోనివుంటే ఆ దుశ్శాసనుని చీల్చివేసేవాడ్ని— వాడ్ని చంపివేసివుంటే ఈ బాధలయినా తప్పేవి—".

ఎలా తప్పుతాయో మాత్రం భీముడు చెప్పలేకపోయాడు. "కర్ణుని విషయం అటో యిటో తేల్చివేసి వున్నట్లయితే యిన్ని గొడవలు వచ్చివుండేవికావు. అతని బలం చూచుకునే దుర్యోధనుడు అలావిగ్రవీగుతున్నాడు అన్నాడు అర్జునుడు. ధర్మరాజు యిందుకుకూడా ఏసమాధానం చెప్పలేదు.

"యివన్నీ అసలు సరయిన కారణాలుకావు. ఇన్నింటికి మూలం శకుని- శకునివలననే యిన్ని అనర్థాలు సంభవించాయి. శకునుని వధించివుంటే ఎంతో బాగుండేది— అన్నాడు సహదేవుడు.

అర్జున, భీమ, సహదేవుల అభిప్రాయాలతో ఏకీభవించలేకపోయాడు ధర్మరాజు. ఈ సకలచరాచర ప్రకృతి అంతా ఈశ్వరమయమని, ఈశ్వరుని అనతిలేకుండా ఏపనులు జరుగవని అతని అభిప్రాయం.

ఇన్ని అభిప్రాయాలు వెలిబుచ్చినా వారెవ్వరికీ యిటు ఆకలిగాని అటు దప్పికగాని తీరలేదు. అవుడు ధర్మరాజు నకులునిచూచి "నకులా— ఈ మహావృక్షం ఎక్కు— నలుప్రక్కలా పరికించు దగ్గరలో జలాశయముందేమో చూడు. ముందు దప్పిక తీర్చుకుందాం అన్నాడు.

అన్నగారి ఆనతివిని నకులుడు చెట్టుఎక్కి నలుదిశలా పరికించాడు. దగ్గరలో ఒక జలాశయం వుండటంచూశాడు- చెట్టుదిగి వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లాడు.

చేతులు కడుగుకొని మంచినీరు త్రాగేసమయానికి ఒక అశరీరవాణి యిలా విన్పించింది. "యిటువంటి అకృత్యం ఎవరు చేస్తున్నారు? ఈ జలాశయం నాది. నా అనుమతిలేక ఎవరూ ఈ జలాశయంలో దిగరాదు. నీరు త్రాగరాదు. ఈ నీటిని త్రాగదలిస్తే ముందు నా ప్రశ్నలకు జవాబు చెప్పాలి".

కాని నకులుడు ఆ మాటలు లెక్కచేయలేదు. కడుపు నిండా నీరు త్రాగాడు. త్రాగిన మరుక్షణమే, విగతజీవుడై పడిపోయాడు

- ఆ తరువాత సహదేవుడు, భీముడు, అర్జునుడు యిదే విధంగా ప్రసర్తించి విగతజీవులయ్యారు.

చివరకు ధర్మరాజు ఆ జలాశయం వద్దకు వెళ్లాడు. మహావీరులైన తన తమ్ములు నలుగురూ అకారణంగా విగతజీవులయి పడివుండటం చూశాడు. దుఃఖం ముంచుకు వచ్చింది. వెంటనే తమాయించుకున్నాడు. ఇదంతా విధి లీల అని ఎంచాడు.

ఎందుకు యిలా జరిగివుంటుందా అని ఎంచాడు. బహుశా జలాశయంలోని నీటిని త్రాగడంవలన ఆవిధంగా జరిగి యుండవచ్చని తలంచాడు. ఏది ఏమయినా ముందు

నీటిని త్రాగి, ఏం జరుగుతుందో గమనించాలని అనుకు న్నాడు.

నీటిని త్రాగడానికి ఉద్యుక్తుడయ్యాడు. అశరీరవాణి వినిపించింది.

ధర్మరాజు ఆగిపోయాడు.

"నా తమ్ములు యిలా అయిపోవడానికి కారణం ఎవ్వరు" అని ప్రశ్నించాడు.

అందుకు సమాధానంగా "నేను" అంటూ యక్షుడు ప్రత్యక్షమయ్యాడు.

"ఎందుకని"

ఈ జలాశయం నాది. నా అనుమతిలేకుండా వారు నీటిని త్రాగారు. యిటువంటి దుర్గతి పొందారు నీకు జీవిం చాలని ఆశవుంటే, ముందు నా ప్రశ్నలకు జవాబులు చెప్పు- ఆ తర్వాత కావలసినంత నీటిని త్రాగు-" అన్నాడు యక్షుడు.

ధర్మరాజు అతని ప్రశ్నలకు జవాబులు యివ్వడానికి తన సంసిద్ధతను తెలియపరచాడు.

అపుడు యక్షుడు ఈవిధంగా ప్రశ్నించాడు.

(యక్షుని ప్రశ్నలు సామాన్యంగా కన్పించినా ఎంతో మహిమాన్వితములు. జ్ఞానప్రదములు- వాటికి ధర్మరాజు యిచ్చిన సమాధానములు సమయోచిత ప్రజ్ఞాప్రాభవాన్ని చూవుతాయి).

1) సూర్యుడు ఉదయించడానికి ఎవరు తోడ్పడు
తున్నారు.

సూర్యోదయానికి బ్రహ్మ తోడ్పడుతున్నాడు.
(సూర్యశబ్దం ఆత్మపరమయినది. ఆత్మశుద్ధి పరిపక్వత ఎలా సిద్ధిస్తాయి అన్నది ప్రశ్న. అందుకు ధర్మరాజు బ్రహ్మ తోడ్పడుచున్నాడు అని సమాధానం యిచ్చాడు. సూర్యుని ఉదయానికి, బ్రహ్మ ఎంత వరకు కారణమో, ఆత్మఉన్నతికి వేదములు అంత కారణము—అని ధర్మజుడు సమాధానం యిచ్చాడు)

2) ఆతని అనుచరులు ఎవ్వరు ?

దేవగణములు అతని అనుచరులు.
(సూర్యునికి దేవగణములు అనుచరులు, కాగా ఆత్మకు సత్యము, సమము, శాంతి మొదలుగాగలవి అనుచరులు. వాటివలన ఆత్మమహోన్నతస్థితి పొందగలుగుతుంది)

3) సూర్యాస్తమయానికి కారణభూతులు ఎవ్వరు ?
ధర్మంవలన సూర్యాస్తమయం అవుతున్నది. (ఇక్కడ ధర్మము అనగా కర్మ, ఉపాసన మొదలుగాగల అర్థాలు మనం తీసికోవచ్చు. వీటి సాయంవలననే ఆత్మ దర్శనం అవుతుంది. సూర్యుడు ప్రకాశిస్తున్నంతకాలం ఆకాశంవంక మనం చూడలేం. అదే విధంగా అధర్మపరులుగా వున్నవారి ఆత్మ శోభించదు. నిత్యకర్మానుష్ఠానములవలన ఆత్మశోభిస్తుంది)

4) సూర్యుడు సామాన్యంగా దేనికి కట్టుబడి వుంటాడు!

సత్యానికి—

ఈ విధంగా యక్షుని మొదటి నాలుగు ప్రశ్నలకు యుధిష్టురుడు సమాధానం చెప్పాడు. యిక్కడ మనం యింకోవిషయం చెప్పుకోవలసివుంది. ఈ ప్రశ్నలు అనేక శాస్త్రిలలోనూ, ఉపనిషత్తులలోనూ కూడా వున్నాయి.

ధర్మరాజు చెప్పిన సమాధానాలకు తృప్తిచెందిన యక్షుడు తిరిగి యిలా ప్రశ్నించాడు.

5) దేనివలన మనిషి వేదవేదాంగ పారంగతుడు కాగ లుగు తున్నాడు ?

సనాతనభావాలు, సంస్కృతి వేదవిజానములవలన మనిషి. వేదవేదాంగపారంగతుడు కాగలుగుతన్నాడు అన్ని విద్యలయందు సమానమయిన వైదుషిగల వాడే విజ్ఞాన అనిభావం.

6) మనిషి ఏవిధంగా గొప్పవాడు అన్పించుకోగలడు.

తపమువలన మనిషి గొప్పవాడవుతాడు.

(తపము అనగా ధ్యానము. జ్ఞానమువలన అవి సిద్ధిస్తాయి)

7) వేటివలన మనిషి ఉత్తముడు కాగలుగుతాడు ?

పరోపకారముపలన.

8) మనిషి దేనివలన జ్ఞాని కాగలుగుతున్నాడు ?

స్వార్థ హితమైన సేవవలన మనిషి ఉత్తముడు అవుతాడు.

(ఆసేవ సాటిమానవులకు కావచ్చు. లేదు పరాత్పరుని సేవకావచ్చు? గురువులను సేవించుట, పెద్దలను పూజించుట మొదలుగాగలవి. మాతృదేవత, పితృదేవుడు గురువు, అతిధి మొదలుగాగల వారిని సేవించుట అనికూడా మనం అర్థం చెప్పుకోవచ్చు).
ఆ సమాధానములు యక్షుడ్ని పూర్తిగా తృప్తి పరచాయి: తిరిగి యిలా ప్రశ్నించాడు.

9) బ్రాహ్మణులకు సంబంధించినటువంటి భగవదాంశ ఏది ?

వేద పరిచయము బ్రాహ్మణులకు చెందిన దైవాంశ. (వేదములు పవిత్రములు. జ్ఞాన ప్రబోధకములు అట్టి వేద పరిజ్ఞానము బ్రాహ్మణులకు ముఖ్యము. కాన వేద విజ్ఞానమే బ్రాహ్మణ్యము.

బ్రాహ్మణత్వము అనుదానికి పవిత్రత, జ్ఞానము అని అర్థము చెప్పదగును. అనగా ఎవరు జ్ఞానియో అతను బ్రాహ్మణుడు. ఎవరు పవిత్రుడో అతను బ్రాహ్మణుడు. ఎవ్వరు సత్కర్మలను ఆచరించగలుగుతారో అతను బ్రాహ్మణుడు.

10) బ్రాహ్మణులు ఎటువంటి కర్మలను ఆచరించాలి ?

సర్వకర్మలను ఆచరించవలసినది బ్రాహ్మణులే. ధర్మములను, నీతులను, న్యాయములను అనుసరించవలసినది బ్రాహ్మణులు. ఇతరులకు నచ్చచెప్పవలసినది వారు. ఆ విషయమున సర్వులకు వారే మార్గదర్శకులు అవాలి—

11) సాధారణంగా ఏది వారి స్వభావము అయివుండాలి?

సాంప్రదాయ సిద్ధమయిన జీవనము., నీతినియమాదులు, వారి స్వభావమైయుండాలి. విజ్ఞానసముపార్జనము, ఆర్జించిన విజ్ఞానాన్ని పదుగురకోసం వినియోగపరచాలి.

12) ఏది బ్రాహ్మణుల విషయంలో చెడుగా చెప్పబడుతోంది ?

ఆచారరహిత జీవనము, మాంసభక్షణము, మద్యము సేవించుట మొదలుగాగలవి. ఇవిగాక మనశ్చంచలత్వము, విషయలోలత్వము సాంప్రదాయములకు విరుద్ధముగా బ్రతుకుట మొదలుగాగలవి మహాపచారములు.

13) అన్నిటికంటె రుచికరమైనది ?

అరచేయి.

14) అన్నిటికంటె భయంకరమైనది ?

స్త్రీ బుద్ది.

15) అన్నిటికంటె పాపకార్య మేది ?

పరపీడనం!

16) కాలకూట విషంకంటె మించిన విషం ఏది ?

పిరికితనం

ఈ విషయం అనేకవిధాలుగా మనం చెప్పుకోవచ్చు- విజ్ఞానహీనునికి సభ విషం- వృద్ధునికి పడుచుభార్య విషం- మొదలుగా గలది.

17) క్షత్రియునకు ఏది అత్యంత ముఖ్యము- వారికి దైవాంశగా లభించినదేది ?

భలహీనులను రక్షించడం క్షత్రియధర్మంగా చెప్ప బడుతుంది. విల్లు, బాణములు, బల్లెము, కరవాలము వారికి అనుచరులు. వాటిసాయంతో అధర్మాన్ని అణచివేయాలి. ధర్మాన్ని సంస్థాపించాలి.

18) క్షత్రియులు ఉత్తములని ఏ విధంగా లేక ఎందు వలన మనం చెప్పవచ్చు ?

యజ్ఞం చేయడంవలన క్షత్రియుడు ఉత్తముడు అవు తాడు, యజ్ఞము బ్రాహ్మణుడే చేయాలి. క్షత్రియుల కొరకు అశ్వమేధయాగము, రాజసూయయాగము మొదలుగాగలవి నిర్దేశింపబడ్డాయి,

అంతేగాక త్యాగబుద్ధి వలనకూడా క్షత్రియులు ఉత్త ములని అన్పించుకుంటారు,

19) వారిలోని బలహీనత ?
పిరికితనము.

అంటే క్షత్రియులు బలవంతులై ధైర్యవంతులై యుండాలి. భయము, పిరికితనము మొదలుగాగలవి వారికి వుండరాదు.

20) క్షత్రియులు ఏ కారణంవలన అంధకారాన బడుతున్నారు ?
ఎవరుగాని ధర్మచ్యుతివలన అంధకారంలో పడిపోతారు. ధర్మాన్ని ఆచరించిన వారికి లోకంలో అపజయం అంటూ వుండదు.

క్షత్రియుల విషయంలో కూడా అంతే.

క్షత్రియులకు కొన్ని ధర్మాలున్నాయి. బలవంతుల చేతను, దుర్జనులచేతను పీడింపబడుతున్న బలహీనులు అమాయకులు, సజ్జనులు మొదలుగాగల పీడితవర్గాల వారికి రక్షణ యివ్వగలిగి యుండాలి. అలాగున రక్షణ యివ్వలేని క్షత్రియునివలన లాభమేమి ? ధర్మరాజు యక్షుని ప్రశ్నలకు ఏవిధమయిన ఆలోచనా లేకుండా వెంటనే జవాబు చెప్పుతున్నాడు. మీమాంసగల ఆ ప్రశ్నలకు యుధిష్టురుని సమాధానాలు ఎంతో సమంజసంగానూ, ఎంతో సంతృప్తికరంగానూ వున్నాయి. తిరిగి యక్షుడు ఇలా ప్రశ్నించాడు.

ప్రతిప్రశ్న ఒక్కొక్క అంశానికి సంబంధించి వుండ టం గమనార్హం! అలాగే ఈక్రింది ప్రశ్నలు యజ్ఞ యాగాదులకు సంబంధించినవి.

24) త్యాగమునకు అవసరమైనది—

బుద్ధి

26) యాగమునకు అవసరమైనది ?

ప్రాణము లేక శారీరక స్తిమితము (యిక్కడ సర్వము యాగమునకు అత్యవసరమే అయిననూ ముఖ్యము అడుగబడినది. శరీరమాద్యం ఖలు ధర్మసాధనమేకదా ! అందువలన ధర్మరాజు ఆవిధముగా సమాధాన మొసగినాడు.

26) యజులలో ముఖ్యమైనదేది ?

మనస్సు

యాగమునకు అన్నియజులు ముఖ్యమైనవి. మనస్సు అతిముఖ్యమయినది. ఆలోచన, జ్ఞాపకము ముఖ్యము యాగవిధులు సరిగా నిర్వర్తింపబడినవా లేదా అన్నది ముఖ్యముగదా—

యాగమున ముగ్గురు ముఖ్యులు— ఋత్విక్కులు (మంత్రములు చెప్పువారు) హెాత (యాగముచేయువాడు) అధ్వర్యులు, ఉద్గతులు యాగవిధిహోమము సరిగా నున్నవా లేవా అని గమనించువారు)

27) ఏది యాగమున ముఖ్యమైనదిగా (పై రెంటిలో) తీసి కొనబడుచున్నది ?

ఋక్కులు

ఋక్ అనగా మంత్రము. అనేక ఋక్కులు కలిసి ఋగ్వేదము, అనేక యజులుకలసి యజుర్వేదము అగుచున్నవి,

యాగమునకు మంత్రము, మంత్రమునకు ఉచ్ఛారణ, ఉచ్ఛారణమునకు సరియగు మానసిక స్థిమితత్వము ముఖ్యములు. శతపథబ్రహ్మమునకూడ యాగము నకు ఋక్ (మంత్రము) వాక్కు (ఉచ్ఛారణ) అత్యంత ఆవశ్యకములని వ్రాయబడి యున్నది.

28) ఏదిలేకపోయిన యాగము నిర్వర్తింపబడదు ?

ఋక్కు

అన్నింటికి అనగా దైవకార్యములకు ఉపాసనలకు మంత్రము ముఖ్యముగదా !

ఈవిధముగా యాగమునుకూర్చి యక్షుడు అడిగిన ప్రశ్నలకు ధర్మజుడు సమాధానమిచ్చాడు.

అనంతరం యక్షుడు మరికొన్ని ప్రశ్నలు అడిగాడు. ఈ ప్రశ్నలు సాధారణమైనవి.

29) జల్లులలో అన్నిటికంటె ఉత్తమమైనది ?

వానజల్లు

30) భూమి లోపలగల వాటిలో ఉత్తమమైనది దేనిని చెప్పవచ్చును ?

విత్తనము

31) చతుష్పాదములలో ఉపయోగమైనది ఉత్తమమయినది ఏది ?

నాలుగు పాదములుగల జంతువులలో గోవు ఉపయుక్తమయినది. ఉత్తమమయినది.

32) వారసులలో ముఖ్యుడు ఎవరు ?

పుత్రుడు

నపుత్ర గతిర్నాస్తి గదా !

యక్షుడు తిరిగి మరికొన్ని ప్రశ్నలు అడిగాడు. ఆ ప్రశ్నలు ఈక్రింద ఉదాహృత మయ్యాయి. అవి పంచా మహా యజ్ఞములకు సంబంధించినవి.

33) జీవించియుండి, సకలసంపదలుగలిగి, అన్నివిధములయిన యింద్రియము జ్ఞానము, ఇంద్రియసుఖము కలిగియుండి, మరణించినవాడుగను, హీనుడుగను చేప్పబడుచున్నాను.

ఈప్రశ్న పంచమహాయజ్ఞములను గురించి అడుగబడినది. పంచమహాయజ్ఞములు అనగా గృహస్థాశ్రమ ధర్మములు. గృహస్థు ఆచరించవలసినవి

దేవకార్యములు నిర్వర్తించుట (దైవభక్తి) అతిథి పూజ ఆశ్రితులను ఆధారపడినవారిని ఆదరించుట, పితృభక్తి (పితృకార్య నిర్వాహము) మొదలుగాగల వాటిని ఎవరు నిర్వర్తించడో వాడు బ్రతికియుండి ననూ చనిపోయిన వానితో సమానము.

మానిషి మనిషిగా జీవించవలెనని హిందూమతము ప్రబోధించుచున్నది. హిందూమతస్తుడు పై ధర్మర ములు పాటించవలసి యున్నది. దేవకార్యములు అనగా పెద్దలను గౌరవించుట అనికూడా చెప్పుకో వలసిఉంది. తననుగూర్చి ఆలోచించి పరులనుగూర్చి కూడ ఆలోచించగల్గుట తనకు చేతనగుసంతవరకు యితరులకు సాయపడుట ఉత్తమ మానవతకు చిహ్నములు.

యక్షుడు తిరిగి మరికొన్ని ప్రశ్నలు అడిగాడు. ప్రతి యక్షుని ప్రశ్నకు ఒక్కొక్క అమూల్యమయిన నీతి వుంది కదూ. ఒక అంశమునుగూర్చిన సమగ్ర మయిన పరిశీలనవుంది. కాగా ఆ ప్రశ్నలకు ధర్మ రాజు యిచ్చిన సమాధానములుకూడ సరిగానూ, తూచినట్లుగాను, ఆలోచనను రేకెత్తించేవిగానూ వున్నాయి.

ఈక్రింది ప్రశ్నలు అతిసాధారణముగా కానవచ్చి ననూ, ఆ ప్రశ్నలయందు ఎంతో భావము నిబిడీకృత మయి యున్నది.

34) అన్నింటికంటె బరువయినదేది ?

తల్లి

భూమి అన్నింటికంటె బరువయినదని చెపుతారు. ఓర్మికికూడ భూమి పెట్టినది పేరు. భూమికంటె బరువైనది తల్లిఅని ధర్మరాజు చెప్పాడు. బిడ్డలనుకని పెంచి పెద్దవారినిచేసి, వారి ఆదర తిరస్కారాలు పొందడానికి సిద్ధమైన తల్లికంటె ఉన్నతులు ఎవరూ వుండరని భావము.

32) ఆకాశముకంటె ఎత్తయినది ?

తండ్రి

ఆకాశము ఎత్తయినది. సర్వజీవరాసులకు అవసరమయిన నీటిని యిస్తున్నది— కాని తండ్రి తనను మర్చిపోయి తనయునికొరకు అన్నింటిని సమకూర్చి పెడుతున్నాడు.

యిక్కడ మనమొక విషయాన్ని గుర్తుచేసుకొనవలసి వుంది. వేదములయందు ఆకాశము, భూమి తల్లి దండ్రులుగా చెప్పబడినవి—
హిందూ పురాణములందు కాని పెద్దల సుద్దులుగాని పరిశీలించిన పితృభక్తి అతిముఖ్యమని గ్రాహ్యమవుతుంది.

ఈ సమయమున రామాయణమునగల అంశము—
శ్రీరాముడు ఒకచోట- తండ్రీ ! నీఆనతిఅయిన ఈ అగ్నిలోనయినమా దూకగలను అంటాడు.

ఈ క్రింది ప్రశ్నలు మరొక తరహాకు చెందినట్టివి.

36) గాలికంటెనూ వేగమయిన దేది ?

మనసు గాలికంటెనూ, ప్రపంచమునగల అన్నిజీవ రాసులకంటెనూ వేగమయినది.

వాయువేగము మనోవేగము అన్నమాటలు మనం వింటూనే వుంటాం—

మనస్సు పరిపరివిధములుగా పోతూవుంటుంది. కాగా మనస్సును జయించగలిగిననాడు సర్వం జయించ గలుగుతాం- అందువల్లనే హిందూధర్మ శాస్త్రాల యందుగాని, మిగతా పురాణగ్రంథాలయందుగాని, చిత్తవృత్తిని నిరోధించడానికి ఎంతో ప్రాధాన్యతను యిచ్చారు.

37) అన్నిటికంటెనూ గడ్డికంటె సంఖ్యలో ఏది అధికము?

యిది యించుమించుగా చాలా విచిత్రమయిన ప్రశ్న ఎందువలనంటే గడ్డిపోచలను లెక్కించటం చాలా కష్టం- అత్యధికసంఖ్యలో, అల్లిబిల్లిగాఅల్లుకుపోయిన గడ్డిని యింతఅని లెక్కించడం ఎలా వీలుపడుతుంది. వీలుపడదు. అటువంటి గడ్డికంటె అధికసంఖ్యలో మనస్సున కదిలే మెదిలే అలోచనలు అలలవలె సంచ రిస్తూ వుంటాయి. అందుకనే ఆలోచనలను గొలుసు కట్టుగా వ్యవహరిస్తూవుంటారు.

ఈ విధంగా ధర్మరాజు చెప్పిన సమాధానాలకు

యక్షుడు ఎంతగానో సంతుష్టిచెందాడు. తిరిగి కొన్ని ప్రశ్నలను యుధిష్టరుని ముందుంచాడు. అవి ప్రకృతికి, జీవరాసులకు సంబంధించినవి. యింతవరకూ మనం చదువుకున్న ప్రశ్నలవలన యక్షుడు అనేక అంశాలకు సంబంధించినట్టియూ, అనేకధర్మశాస్త్రాలకు సంబంధించినట్టియూ సంశయాలుగా మనకు కానవస్తాయి. కాగా ధర్మజుని సమాధానాలుకూడా మాటిగాను, సమయోచితంగానూ, జిజ్ఞాసను అధికం చేయునట్టివిగానూ వున్నాయి. ఈక్రింది ప్రశ్నలు జీవరాసినిగూర్చి నట్టివి.

38) నిదురించునపుడుకూడా కనులుమూయనిది దేది ?

నిద్రావస్థ జీవరాశికి ముఖ్యమైనది. కనులుమూసి నిశ్చింతగా విశ్రాంతి గొంటుంది జీవి. కాని చేప మాత్రము అలాకాదు. నిదురించే సమయంలో కూడా కనులు తెరచుకొనే వుంటుంది.

39) జననమొందిన తరువాతకూడా కదలక జడపదార్థం వలె యుండునదేది ?

జననమొందిన ప్రతిజీవికి చలనం ముఖ్యం- కదలుతూ ప్రకృతిని తనకు అనుగుణంగా త్రిప్పుకోడానికి యత్నిస్తుంది. కాని కోడిగ్రుడ్డు విషయం అలాకాదు. కోడిగర్భంలోనుంచి బయటపడిన గ్రుడ్డు కదలదు. అలానే పడివుంటుంది. గ్రుడ్డు పిల్లఅవడానికి కోడి పొదగవలసి వుంటుంది.

40) గుండెలేనిది ఏది ?

అన్నింటికి హృదయంఅనేది వుంటుంది. పాతకాలపు విశేషాలు అటుంచి, శాస్త్రీయ పరిశోధనలద్వారా అన్ని జీవరాసులకు గుండె వుంటుందని స్థిరపడింది. చెట్లుకూడా ప్రాణంకలిగి వున్నాయని తెలియచేయబడింది.

కాని రాయికి గుండెలేదు ! గుండెలేని రాతిని మనోహరంగాచెక్కి రాగాలెరిగిప రాతిగుండెను సృష్టించుతాడు శిల్పి.

స్వయంగా ఆలోచించలేనివాడు నిర్దాక్షిణ్యంగా వ్యవహరించేవారుకూడా రాతివంటివారే !

41) తనకుతాను సాగిపోయేది ?

ప్రపంచంలో అన్నివస్తువులకు ఒక సాయంవుండాలి. ఆ సాయంవుంటేగాని కదలలేవు కాని నది అలా కాదు. నదీప్రవాహం తనకు తానుగా ప్రవహిస్తుంది. క్రొత్తశక్తి పుంజుకుంటుంది. సాగిపోతూవుంటుంది. అనంతరం యక్షుడు స్నేహాన్నిగురించి స్నేహితులను గురించి ప్రశ్నించాడు.

42) ప్రయాణీకునకు స్నేహితుడు ఎవ్వరు ?

ప్రయాణం (ప్రవాసము) పూర్వకాలంలో ప్రమాదభరితంగా వుండేది. ముఖ్యంగా కాలిబాటల సాయంతో జనులు అరణ్యాలలో, కొండలలో, కోన

లలో సాగిపోతూ వుండేవారు. ఆరోజులలో దొంగల భయం అధికంగా వుండేది. ముఖ్యంగా వ్యాపారులు ప్రాణాలను అరిచేతులలో వుంచుకొని ప్రయాణించే వారు. అట్టి సమయంలో కొంతమంది వ్యాపారస్తులు కలసిమెలసి ప్రయాణం చేసేవారు. ఒకరి కొకరు తోడుగా ఆ ప్రయాణాన్ని సర్థ అని అనేవారు. ఈ రోజుల్లో అలాకాదు. ప్రయాణసాధనాలు మిగిలిన విషయాలలోనూ ఏంతో మార్పు వున్నదికదా !

43) ఇంటిపట్టునే వుండిపోయే వారి మిత్రుడెవరు ?

(గృహస్థుకు మిత్రుడెవరు ?)

ఈప్రశ్న చాల విచిత్రమైనది. మనిషి జీవితంలో మిత్రుడెవరు అన్నదిప్రశ్న ఆప్రశ్నకు జవాబుకూడా అత్యంత క్లిష్టతరమయినది. మనిషి జీవితంలో ఒక ముఖ్యమయిన మలుపు వివాహం. వివాహంవలన మనిషి గృహస్థు అవుతాడు: గృహస్థుకు మిత్ర మెవరు- భార్య- జీవితకాలము అతనితో గడిపేది భార్య: కష్టంలో, సుఖంలో, బాధలో, సంతోషంలో సహచరి భార్య—

వివాహకాలంలోనే ఈ విషయాలనుగురించి చెప్ప బడుతుంది వివాహంలో అత్యంత ముఖ్యముగా చెప్పబడే సప్తపది అర్థం అదే- సప్తపది అంటే ఏడు అడుగులు.

ఈ ఏడు అడుగులువలన మనం స్నేహితులమయి నాము. మన స్నేహం స్నిగ్ధము - సంపూర్ణము - నిత్యము. నేను ఏ సమయమునను నీ స్నేహమాధు ర్యమునకు దూరముకాను. మన మిరువురము ఒకటి. తనువులు వేరయినా మనసొకటిగా మనం మిగిలిపో తాము. పరస్పర ప్రేమాకర్షణాలో, నిత్యనూత్న తేజస్సుతో వెలిగిపోదాము.

యిందువలన స్నేహము అందులోని అర్థము, మాధు ర్యము అర్థమవుతాయి. ఈక్రింద స్నేహము గౌర వము విపులీకరించబడ్డాయి. వరుడు వధువునుగాంచి-

నీ భర్తను ప్రేమించి లాలించి అతని విశాలవక్షంలో సేదతీరి గౌరవం సంపాదించుకో. వివాహధర్మంలో ఒకభాగం, కుమారి కుమారులమయిన మనం సృష్టి కార్యాన్ని నిర్వర్తించడం- ఆరోగ్యవంతులైన పిల్ల లనుకని సమాజానికి అందించడం- నీ భర్తను నీ భర్త తరఫువారిని గౌరవించి, నీ గౌరవాన్ని నువ్వు పొందు—

యిదేవిధంగా సీతాపహరణం సమయంలో శ్రీరా ముడు- ఓసీతా ! నా మానసిక వికారాలకు నీవు తగిన ఔషధానివి అని వాపోతాడు!

44) వ్యాధిగ్రస్తునికి మిత్రులెవరు ?

వైద్యుడు.

శ్రాద్ధాహృదయునికి మిత్రము తగువుండు.

పాపికి భగవన్నామస్మరణమె మిత్రము.

45) మృత్యుముఖమునవున్న మనిషికి మిత్రుడెవరు ?

మానవజీవితమున మృత్యు వొకదశ. పుట్టినజీవి గిట్టక మానదు. మరణము తథ్యము. అట్టి మరణసమయ మాసన్నమయిన స్నేహితుడెవరన్నది యక్షుని ప్రశ్న దానధర్మములు.

మనిషి పుణ్యగతులు పొందుటకు ఉపయుక్తమయ్యే విధానములు.

అందువలనే జీవించియుండగా ఏవిధమైన దానధర్మ ములు, ఆచరించిననూ ఆచరించలేకపోయిననూ, మరణానంతరము కర్మ నాచరించకపోయిననూ, మర ణానంతరము కర్మనాచరించుట- కర్మనాచరించు టలో అర్థమదియే!

తిరిగి యక్షుడు కొన్ని సంశయాలను ధర్మజుని ముం దుంచాడు.

46) సర్వజీవరాసులకు అతిథి ఎవరు ?

అగ్ని అన్ని జీవరాసులకు అతిథి. అతిథి అనగా భోజనాది సౌకర్యములలో గౌరవింపబడదగిన మనిషి యిక్కడ అగ్ని అతిథిగా చెప్పడం జరిగింది. ఆవు

పాలతో నేయితో అగ్నిని ఆరాధించడం మనం చూస్తాం ఎందుకని—

అగ్నివలన సముద్రాలలో నీరు ఆవిరిగామారి మేఘ రూపం చెందుతుంది. ఈ మేఘాలవలన వర్షం వలన పంటలు సమృద్ధిగా పండుతాయి. చేలు పచ్చగా కలకలలాడుతుంటాయి.

యిదిలావుండగా మనిషి ఆకలిని జఠరాగ్ని అంటారు. ఉదరంలోని ఆకలిఅనే అగ్నిని ఆహారంతో ఆరాధించడం సామాన్యమేగదా!

47) ఐహికధర్మ మది ఏది?

సోము - అని ధర్మరాజు ప్రత్యుత్తర మిచ్చాడు. సోమ అనగా చంద్రుడని అర్థం. వెన్నెల పాలవలె స్వచ్ఛంగా, నిర్మలంగా వుంటుంది- నిర్మలమైన భావసంపద, స్వచ్ఛమైన ప్రవర్తన ఐహికధర్మములుగా చెప్పుకోవచ్చు.

సోమయాగము అన్నదికూడా యిక్కడ జవాబుగా మనం అన్వయించుకోవచ్చు—

ఆత్మజ్ఞానమునుకోరువారు యాగములు, దానములు, ఉపవాసములు, జపతపములు, పూజలు నిర్వర్తించుటకూడా యిహాధర్మములను సముపార్జించుకొనుటకే అని గ్రహించవలసియున్నది.

మనిషి జీవితకాలమున యిహలోకమున తాను నిర్వ ర్తించవలసినవి విధిగా నిర్వర్తించవలసి యున్నది కదా !

యిందువలన మనిషి తనకుగా జ్ఞానియగుటయేగాక, పరిశుద్ధి కలవాడవుతున్నాడు.

48) ఏది అమృతము.

మృతముకానిది అమృతము. చావులేనిది అమృ తము. చావును జయించునది అమృతము. ఆమృ తము దేవతలసొత్తనికదా మరి యక్షుడు అమృత మన్న నేమియని ప్రశ్నించాడు.

ందుకు మహారాజు యుధిష్ఠరుడు పాలు అని సమా ధానమిచ్చాడు. భౌతికశాస్త్ర విజ్ఞానము పాలు సమీ కృత ఆహారముగా పేర్కొనుచున్నది. సమృద్ధికర ఆహారము. జవసత్వములను కలుగచేయు ఆహారము అమృతముతో సమానమేకదా !

49) ప్రపంచమంతా నిండియున్న దేది ?

ఈలోకమంతా వాయువుతో నిండియున్నది. అండ పిండ, బ్రహ్మాండములనిండి యున్నది గాలి—

తరువాత యక్షుడు, ధర్మరాజును చూచి క్రింది ప్రశ్నలు అడిగాడు. ఈ ప్రశ్నలు గ్రహములగూర్చి నట్టివి. గ్రహాయానమునకు సంబంధించినట్టివి.

50) ఈలోకమున ఒంటరిగా ప్రయాణము చేయువారెవ్వరు ?

సమస్తజీవులకు తానొక్కొక్కడై సంచరించు-సూర్యుడేగదా ! ముందు ప్రశ్నలో లోకమున వాయువు నిండియున్నదని చదివితిమిగదా! అట్టి వాయువు అంతరించినరీతి- మిగులునదేది- మిగులునది జ్యోతి- అనగా వెలుగు యిందువలన జ్యోతి ఒంటరిగా సంచరిస్తుందని మనం గ్రహించవలసి వుంటుంది.—

సమస్తము అంతరించినతరి ఒంటరిగా పయనించు సూర్యుని లేక జ్యోతి మానవాధారము. అనగా ఆత్మజ్ఞానము ఒక్కటే మానవులకు మార్గదర్శకత్వం వహించగలదు.

51) తిరిగి జన్మించునది ఏది ?

చంద్రుడు తిరిగి జన్మించును.

యిక్కడ చంద్రుడు అనగా అవిద్య అనిఅర్థము. అవిద్యవలన దుఃఖము సంభవిస్తుంది. దుఃఖాబాజనుని జీవితము దినదినగండముగదా ! విద్యాగ్రంథము లేక ప్రకాశవంతమైయున్నను రాణించని చంద్రుని విథమున తిరిగి తిరిగి జన్మమెత్తవలసియున్నది. (చంద్రుడు మనస్థితికి అన్వయము)

52) మంచుకు, పొగమంచుకు విరుగుడు ఏది ?

నిప్పు.

మంచు నిప్పుకు కరగిపోతుంది. సూర్యభగవానుని వాడి వేడి కిరణాలకు పొగమంచు విడిపోతుంది.

అవిద్య, లేక అజ్ఞానము మనిషిజీవనాన్ని పొగమంచు వలె ఆవరించుకొని వుంటుంది. పొగమంచు అగ్నికి విడిపోతుంది. కరగిపోతుంది. సర్వశక్తి సమన్వితమైన ఆత్మజ్ఞానము అను అగ్నివలన అవిద్య అను పొగ మంచు తెరలు తెరలుగా విడిపోతుంది.

53) అన్నిటికంటెను విశాలమైనది ?

భూమి.

54) అణుసంయోగంవలన ఏర్పడిన వాటిలో పెద్దది ఏది?

భూమి.

55) సర్వశక్తి సమన్వితమయిన, సర్వసుగుణ సమ్మశ్రిత మయిన అంశము ఏది ?

సమైక్యత. సత్యసంధత.

కాగా సర్వసుగుణములనుమించు కార్యమొనరించు వాడు సర్వేసర్వత్రా పూజ్యనీయుడు అవుతాడు. ఐకతాభావ నంపదగలిగి, సత్యము ధర్మములపై నమ్మికతో ఎటువంటి అనుమానములులేక తాను చేయదలచిన కార్యమునుచేయుట అందువలన ఆ కార్యకర్త నామము సూర్య చంద్రులు వున్నంత

వరకూ నిలిచిపోతుంది. ఒక మహారాజు స్వర్గలోకము నుండి భూమికి నెట్టివేయబడతాడు. ఆ మహారాజు భూమిపై పుపడుతూ నాకీర్తి పడిపోయింది అనివాపోతాడు. యిందువలన మనిషి యొనరించిన సత్కార్యములవలన అతని పరలోక విత్యవ్యము ఆధారపడివుంటుందని అర్థమవుతున్నది.

ఈ సమయంలో ఈ సత్యాన్ని ఋజువుపరచగలందులకు యింద్రద్యుమ్న మహారాజు వృత్తాంతము పొందుపరచబడింది.

మహాభారతం అరణ్యపర్వమున ఇంద్రద్యుమ్న మహారాజు వృత్తాంతము పొందుపరుపబడి వున్నది. ధర్మరాజు విన్న అనేక గాథలలో యిది యొకటి.

ఇంద్రద్యుమ్నుడు మహాచక్రవర్తి— సత్యసేలుడు. ధర్మపరుడు. ప్రజలను కన్నబిడ్డలుగా పరిపాలించాడు. పుణ్యఫలంవలన అతనికి స్వర్గవాసం లభించింది. చిరకాల స్వర్గవాసంవలన అతను సంపాదించిన పుణ్యఫలంకాస్తా కరిగిపోతుంది. స్వర్గంలో నివసించడానికి అనర్హుడు అవుతాడు. తిరిగి భూమికి విసరివేయబడతాడు.

ఆ సమయమున ఆ మహారాజు ఈవిధంగా వాపోతాడు— అయ్యో— నాకీర్తి కరిగిపోయింది. నా నా పుణ్యఫలం సమాప్తిచెందింది. నా యశము పతనమయింది—"

తరువాత మహారాజు ఇంద్రద్యుమ్నుడు మార్కండేయ మహర్షి వద్దకు వెళ్లుతాడు. ఆ మహర్షికి నమస్కరించి— తనవిషయం ఆతనికి విన్నవిస్తాడు. అందుకు మార్కండేయుడు—

"ఇంద్రద్యుమ్నుడు ఎవరో తెలియదు" అంటాడు. ఇంద్రద్యుమ్నుడు ఖిన్నుడౌతాడు. ఒక్కనిముషం ఆగి—

"తమకంటె పెద్దవారైన చిరంజీవి ఎవరైనా వున్నారా" అని ప్రశ్నించాడు.

అందుకు మార్కండేయుడు ఇంద్రద్యుమ్ననికి బికుని వృత్తాంతము చెప్పుతాడు.

ఇంద్రద్యుమ్నుడు బికునివద్దకు వెళతాడు. అదే విధంగా తాబేలువద్దకు వెళ్లుతాడు.

చివరకు తనకంటె అధికంగా తనపేరునుగూర్చి తాను ఇంతకుపూర్వం ఒనరించిన ధానధర్మములను గురించి పలువురు పలురకాలుగా కీర్తించడం విన్నాడు. అతని హృదయం ఆనందంతో వుప్పొంగిపోయింది. కనులు చెమర్చాయి.

సరిగా అదేసమయంలో దేవలోకంనుంచి తిరిగి అతనికి ఆహ్వానం వచ్చింది.

56) ఎందువలన కీర్తి వస్తుంది?

మనిషి తానొనరించిన పనులవలన మంచిచెడ్డలు ఆధారపడివుంటాయి. దానధర్మాలవలన మంచి కీర్తి లభిస్తుంది. పాత్రగల దానధర్మాలు ఆ కీర్తిని నిల బెట్టుటయేగాక శాశ్వితత్వాను నాపాదించి పెట్టు తాయి.

57) ఏది దేవలోకమునకు మార్గదర్శకము కాగలదు ?

హిందూమత ధర్మశాస్త్రములయందు ప్రముఖంగా నరకము, స్వర్గము, దేవలోకముల ప్రశంస కనబడు తుంది. మనిషి తనజీవితకాలమున చేసినమంచి, లేక చెడ్డపనులవలన, స్వర్గ లేక నరకవాసము లభిస్తుందని చెప్పబడుతున్నది. అయితే యిప్పుడు యక్షుడు ధర్మజుని అడిగినది అట్టి స్వర్గమునకు గొనిపోవుటకు శక్తివంతమైన మార్గదర్శకము కాగలిగినది ఏది అని. అందుకు ధర్మజుడు సత్యము అని జవాబు చెప్పాడు. సత్యమువలన మనిషి సులభముగా స్వర్గలోకవాసి కాగలడు.

భూలోకమున అతనికీర్తి ఎంతకాలముయితే చెక్కు చెదరక నిలిచివుంటుంది. ఆ వ్యక్తికి స్వర్గలోకవా సము అంతకాలము స్థిరమైయుంటుంది.

సత్యము మనిషిని మరింత ఉన్నతుడ్ని చేస్తుంది. సుఖసంతోషములకు మూలము సత్యము.

58) అన్నిసుఖములకు అధారమేది ?

సత్ప్రవర్తన.

59) మనిషికి ఆత్మ ఏది ?

కుమారుడు.

పున్నామనరకంనుంచి తప్పించువాడు పుత్రుడు. అలాగే భార్యకూడా మనిషికి ఆత్మవంటిదని చెప్ప బడుతున్నది. భగవత్ వరప్రసాదమువలని, అమాయ కురాలగు యువతి తనకు భార్యయైనది. తన సర్వ స్వము అతని కర్పించినది. అట్టి కన్యను చూచుట అతని కర్తవ్యము. ఎచ్చట స్త్రీలు గౌరవించబడు దుర్గో అచ్చట దేవతల కృపాదృష్టి సత్యము నిలచి యుండును.

60) భగవదత్తమైన వాటిలో ఉత్తము మిత్రులు ఎవరు ?

ఈప్రశ్నకు ముందుపుటలలో వివరముగా జవాబొ సంగబడినది. స్థూలముగా భార్య అని చెప్పుకొన వలయును.

61) మవిషి సుఖముగా జీవించుటకు అధారభూతమగు నట్టిది ఏది ?

వర్షము.

సకాలమున వర్షమువలన పంటలు వృద్ధియగును. పంటలు బాగుగా పండుటవలన మనిషికి కావలసిన ఆహారపదార్థములు లభించును.

62) మనిషి అవలంభించదగువాటిలో ఉత్తమము అగునది ఏది ?

దాతృత్వము.

63) గౌరవించదగిన వాటన్నింటియందునూ మొదటిది ఏది ?

ఐకమత్యము.

64) మనిషి తెలుసుకొనదగినవాటిలో ఉత్తమమైనది ఏది ?

తెలుసుకొనుటయే ఉత్తమమైనది. మనిషి సర్వము తెలుసుకొనుటకు యత్నించవలసి యున్నది. సమృద్ధియు, సంతుష్టికరమైనట్టియూ జ్ఞానమును పొందుటకు అన్ని విషయములు మనిషి తెలిసికొని యున్నది.

65) సకల భాగ్యములలోనూ ఉత్తమమైని భాగ్యము ఏది?

ఆరోగ్యమే మహాభాగ్యము.

66) అన్నిటికంటెను అత్యంత సౌఖ్యకరమగునట్టిది ఏది ?

సంతృప్తి.

67) లోకమునగల ధర్మములన్నింటియందునూ అత్యుత్తమైన ధర్మమేది ?

సర్వజీవులయెడనూ దయగలిగి యుండుటయే ఉత్తమమైన ధర్మము. అంతకుమించిన ధర్మము మరియొకటి లేదు.

అందరియెడనూ దయగలిగి యుండుట అనునది లౌకిక
ముగా జీవించువ్యక్తికి సాధ్యముకానిపని. అందు
కనే సన్యాసి సుఖఅనియూ, సన్యాసి అన్నిధర్మములు
నిర్వర్తించగలడనియూ శృతులు వక్కాణించు
చున్నవి.

68) సత్వఫలితము నొసగునట్టిదియూ, సత్ఫలము నొసగు
నట్టిదియూనగు ధర్మమేది ?
వేదములందు లిఖించబడినట్టి ధర్మములను ఆచరించు
టవలన సత్ఫలితములను సత్వరముగా పొందవచ్చును.
వేదధర్మమునకు సత్ఫలముండును.

69) ఏ విషయమును నిగ్రహించుటవలన మానవులు
దుఃఖభాజనులు కాకుండా యుండగలరు ?
పరిపరివిధములగు అలోచనలకు మూలము మనస్సు.
చలించుస్వభావము గలట్టిది మనస్సు. అట్టి మన
స్సును అధీనములో నుంచుకొనుటయూ, మనోనిగ్ర
హమును కలిగియుండుటయూ, మానవులు చేయదగి
నట్టివి. అందువలన మానవులు దుఃఖసముద్రము
నుండి దరిచేరగలరు.

70) పరిచయము, స్నేహము మొదలుగాగలవి ఏ విధ
మున స్థిరముగా యుండగలవు ?
సదభిప్రాయము, సదాలోచనలవలన పరిచయము
స్నేహితులుగా నిలబడిపోగలదు. అట్టిస్నేహము చిర
స్థాయిగా యుండగలదు.

తిరిగి యక్షుడు ఈక్రిందివిధంగా ప్రశ్నించాడు. వర్జనీయమగు విషయములనుగూర్చిన ఈ సంశయములు అత్యంత ప్రాధాన్యత గలట్టివి.

71) ఏదివిసర్జించుటవలన మనిషి ప్రేమించబడుచున్నాడు?

గర్వము.

72) ఏది విసర్జించినందువలన మనిషి బాధాతప్త హృదయుడు కాకుండా యుండగలుగుచున్నాడు ?

క్రోధములను వర్జించినందువలన మనిషి దుఃఖభాజనుడు కాకుండా యుండగలడు.

73 ఏ విషయాసక్తిని విసర్జించినందువలన మనిషి భాగ్యవంతుడగు చున్నాడు ?

కోరికలను జయించినందువల్ల.

74) ఏది వదలివేయుటవలన మనిషి సుఖపడుచున్నాడు ?

ఇంద్రియలోలత్వము.

కామ, క్రోధ, మద, మాత్సర్యములను విడనాడవలయుననియూ, వాటివలన ఎన్నోవిధములుగా కీడు జరుగుననియూ, అట్టివాటిని విసర్జించుట మంచిదనియూ, అందువలన మనిషి సుఖసంతోషములు పొంది జ్ఞాని కాగలడనియూ మనము గ్రహించవలసి యున్నది.

ఈక్రింది ప్రశ్నలలో మనము సాధారణముగాచేయు కొన్నిపనులు అట్లు ఎందుకు చేయవలసివచ్చెనో విశదీకరించబడినది.

75) బ్రాహ్మణులకు దానమొసంగుదురుకదా! అట్లు ఎందుకు దానమీయవలయును?

బ్రాహ్మణులకు దానమిచ్చుటసామాన్యము. మనము ఎందుల కీయవలయును. దానము మన మొసంగునది బ్రాహ్మణులకుకాక వారొనరించు ధర్మమునకు- అనగా మనము గౌరవించునది వ్యక్తులకుకాక వారు ఆచరించు ధర్మములకు అనుగ్రహించవలయును.

76) నటులకు, నాట్యకత్తెలకు ఎందులకు మనము కానుకలు యిచ్చుచున్నాము?

నటులు, నాట్యకత్తెలు ఆయావృత్తులను స్వీకరించి తద్వారా కీర్తిసముపార్జించి యుందురు. అట్టివారిని గౌరవించుట, కళను, వారి కళాకౌశలమును గౌరవించుటయే!

77) సేవకులకు బహుమతి నెందుకు ఈయవలయును?

సేవకులు అల్పసంతుష్టులు. వారికి అప్పుడప్పుడు బహుమతులు యిచ్చుటవలన వారిమనసు స్థిరముగా యుండగలదు

78) రాజులకు బహుమానాలను అందించుట ఎందులకు ?
భయము వలన.

(భక్తివలననూ, ప్రేమవలననూకూడా రాజులకు బహుకృతులను అందచేయుటకూడా అరుదు)

79) ప్రపంచము దేనితో నిండియున్నది ?
ఈప్రశ్న లౌకికమయినది. పంచ భూతములు ప్రకృతి మొదలుగా గలవికాక, ప్రపంచమున ఏది వ్యాప్తియందున్నది లేక ప్రపంచము ఏ విషయంతో నిండియున్నది. ఇందుకు ధర్మరాజు ఈవిధంగా సమాధానం యిచ్చాడు.

అమాయకత్వముతో ప్రపంచము నిండియున్నది. అమాయకత్వము పలువిధములు. జ్ఞాని అమాయకుడు. నిందుకుండ. ఇచ్చట అమాయకత్వమన జ్ఞానమువలన సంభవించినది కాదు. కేవలము అవిద్య వలన. విద్యాగంధము లేనిమనిషి సర్వము తెలిసినవాడనంచు విర్రవీగును. అనాగరికత, అసభ్యత, అవిద్య, కుసంస్కారమువలని సంభవించే మూర్ఖత.

80) దేనివలన వస్తువులు ప్రకాశించు చున్నవి ?
వెలుగు వలన.

ప్రకాశము అనగా వెలుగు. సూర్యునివలన వెలుగు సంభవించుచున్నది. జ్ఞానమువలన మనిషి ప్రకాశించును. జ్ఞానవిహీనుడు మట్టిముద్దవలె అణగియుండును.

అజ్ఞానము వలననూ, ఆలోచన హీనతవలననూ, వస్తు ప్రకాశము లోపించగలదు.

81) ఏకారణమువలన స్నేహమును విసర్జించదగును ?

ఆశ, క్రోధము, కామును, మొదలుగాగల దుర్గుణముల గలుగు స్నేహములను విసర్జించవలెను.

82) ఏకారణమున మనిషి స్వర్గసుఖములకు దూరమగు చున్నాడు ?

వ్యామోహామువలన మనిషి దుఃఖభాజనుడగు చున్నాడు. అందుకనే తనకు తానుగా కర్తవ్య మూఢుడగుచున్నాడు. కర్తవ్యము తనవంతు, కాపాడుట అతని వంతు. కాని కర్తవ్యమును నిర్వహించ లేనివాడు సర్వేసర్వత్రా అన్నింటిని పోగొట్టుకొను చున్నాడు.

83) ఎవరు బ్రతికియున్నను చనిపోయినవారుగా ఎంచ బడు చున్నారు ?

ధనం మూలం ఇదం జగత్ — ప్రపంచము డబ్బుతో నిండియున్నది. దారిద్ర్యముతో బాధపడువాడు జీవచ్ఛవమని చెప్పదగును.

దారిద్ర్యపీడితుడు అనగా ధనలోపమువలన దరిద్రుడు లోభికూడా దరిద్రుడే— యాగకార్యములు నిర్వహించి సరియగు దక్షిణలను యివ్వనివాడు దరిద్రుడు.

84) ఎప్పుడు మహాసామ్రాజ్యము పతనావస్థయందున్న దని చెప్పనగును ?

పాలకుడులేని రాజ్యము పతనమయినదిగానే చెప్పబడుచున్నది. అటులనే సరియైన పాలకుడు లేకపోవుట యందుకూడ అన్వయించుకొనవచ్చును. కాగా ఎటువంటి అభివృద్ధిని సాధించలేని రాజ్యమునుకూడ ఏ విధముగా చెప్పుకొననగును.

రాజ్యములలోని ప్రజల జీవనము స్థితిగతులు సరియగు ప్రమాణమున లేనిఎడల అట్టిరాజ్యము రాజ్యమని ఎట్లు చెప్పనగును అని ధర్మరాజు సమాధానం యిచ్చాడు.

85) శ్రాద్ధము ఎట్లు ఎప్పుడు నిర్జీవము అగుచున్నది ?

వేదములయందు చెప్పబడిన ప్రకారము శ్రాద్ధ కార్యములు నిర్వర్తించవలసి యున్నది. అట్లు జరుగని ఎడల అది నిర్జీవమేగదా !

శ్రాద్ధము పూర్తయిన తర్వాత పిండాలను జీవనది యందు కలుపవలసి యున్నది. అది జరుగనిఎడల ఆ కార్యమువలన కలుగు ప్రయోజనము లేదుగదా !

86) యాగము ఎపుడు నిరర్థకమగు చున్నది ?

యాగవిధులన్నియు సరిగా నిర్వర్తించినపిదప, ఋత్వికులకు (యాగమును నిర్వహించినవారు) దక్షిణగాని

ప్రతిఫలముగాని యివ్వనిచో అట్టియాగము నిరర్థక మగుచున్నది.

అటులనే త్యాగముగూడ. త్యాగమువలన ఎవరేని లబ్ది పొందవలసి యున్నది. అటుల జరుగనియెడల త్యాగమువలన ప్రయోజనము లేదుగదా!

ఆ ప్రత్యుత్తరములకు సంతుష్టుడైన యక్షుడు తిరిగి ఈవిధంగా ధర్మజుని ప్రశ్నించాడు.

87) ఏది మంచి ?

అని యక్షుడు అడిగినదానికి ధర్మజుడు ఈవిధంగా జవాబు చెప్పాడు.

ఏది మంచిమార్గమును నిర్ణయిస్తుంది లేక నిర్వహిస్తుంది అన్నవిషయం యిందులో ధ్వనిస్తున్నది. మనసదాలోచనయే మంచిఅని చెప్పవలసి వస్తుంది. ఒకరిమంచి మరొకరికి మంచికాకపోవచ్చు. అందువలన మంచిఅని ఆలోచించనిదే మంచిగా చెప్పకోవలసి వుంటుంది, ఒరులు ఏది యొనరించిననూ మన మంచికే అన్నభావనకూడా ఉత్తమమైనదే.

88) ఏది జలముఅని చెప్పబడు చున్నది ?

అకాశము జలముగా చెప్పబడుచున్నది. ఆకాశము శూన్యముగదా— శూన్యము జలమని భావము. శూన్యమున ఏమియూ లేదనిగదా అర్థము— మరి

జలములని ఎట్లుచెప్పనగును — అందుకు ఈక్రింది వివరణమును పరిశీలించవలసి యున్నది.

అణుసంయోగమువలన జీవము ఉత్పత్తియగును గదా ! శూన్యమునుండి అణువులు, అణువులనుండి జలము, జలమునుండి భూమి పంచ భూతములు ఆవిర్భవించినవి. ధర్మజుడు యిచట గొప్పసిద్ధాంత మును సమన్వయ పరిచాడు. జీవము, బ్రహ్మముల పరస్పర పవిత్రతకలయికే శూన్యముఅని నిర్వచించి నాడు.

88) ఆహారము అననేది ?

గోవు ఆహారముగా చెప్పనగును. గోవువలన పాలు, పాలవలన మజ్జిగ, వెన్న, మధురము మొదలుగా గలవి ఉత్పత్తియగును. పంచామృతము ప్రాణావస రములు. వీటి ఆధారభూతములే మిగిలిన సమస్త వస్తుసముదాయము. ప్రార్థన, సేరాధనకూడా ఆహా రములవంటివే గోవు పవిత్రతకు చిహ్నము. గోఆరా ధన, ప్రార్థన భక్తిమార్గమునకు ఆహారము వంటివి.

89) ఏది విషము ?

కామము, క్రోధము, మదము, మాత్సర్యము మొద లగునవి మహావిషములు. ఈ విషములకు విరుగుడు యుండదు. ఈ విషయములలోలుడైన మనిషి విష ప్రాయుడు.

90) శ్రాద్ధమునకు, ఉచితమైన, ఉత్తమమైన సమయమేది?

ఈ ప్రశ్నకు జవాబిచ్చి మంచినీటిని త్రాగుమని యక్షుడు అన్నాడు.

అందుకు యుధిష్టరుడు ఈ ఒకపనిచేయుట అవమానము అనిభావింపకుండుట అన్నివిషయములను ఒకే విధముగా స్వీకరించుట ఓర్పుకు చిహ్నములు.

91) ఏది అవమానము ?

దైవమిచ్చిన సంపదను నిర్లక్ష్యము చేయుటయూ, దుర్వినియోగము చేయుటయూ అవమానము అని భావింపవలయును.

92) ఏది జ్ఞానము ?

సత్యమును పరిరక్షించుటయే జ్ఞానము. సత్యపరిపాలనమూకూడ జ్ఞానముగా భావించవలెను.

93) తృప్తి ఎట్లు లభించును ?

సర్వులూ సుఖపడవలయునన్న వాంఛవలన తృప్తి లభించును.

94) ముక్కుకుసూటిగా వ్యవహరించుట అననేమి ?

సర్వులఎడనూ ఒకేవిధముగా, ఎట్టి దురాలోచనయు లేక నిర్మొగమాటముగా వ్యవహరించుట.

95) తనకు శత్రువు ఏది ?

తన కోపమె తన శత్రువు.

96) మనిషికి రక్షణ ఏది ?

తన శాంతమె తనకు రక్ష.

97) అంతులేని కోరికలు ఏవి ?

విషయలోలత్వమున బడినమనిషి అన్నియూ తనకు కావలయు నన్పించును.

98) ఏది ఉత్తమమని చెప్పబడుచున్నది ?

సర్వజనులు సుఖశాంతులతో వర్ధిల్లవలెనన్న వాంఛ ఉత్తమము.

99) ఏది అధమము ?

సర్వధర్మములను పరిత్యజించుట అధమము. వ్యసన లంపటత్వము అధమము.

స్వార్థపరాయణత్వము అధమము.

సర్వజనుల సుఖశాంతులను హరించుట, తన సుఖమునే ప్రధానముగా ఎంచుట మొదలుగాగలవి అధమములు. అట్టివాడు అధముడు.

అందునవ్యక్తి ఉత్తముడవ గోరినముందు స్వార్థమును త్యజింపవలసి యున్నది.

100) ఏది అజ్ఞానము ?

ధర్మమునుగురించి తెలిసికొనకపోవుట, ధర్మచింతన లేకపోవుట, మొదలుగాగలవి అజ్ఞానము.

101) గర్వమన నేమి ?

తనయంతటివాడు లేడనిఎంచుట గర్వము? ఆత్మపరిజ్ఞానము వలనకూడా గర్వము ఏర్పడును.

102) సోమరితనము అననేమి ?

తనయొక్క విధులను నిర్వర్తించకపోవుటయు నిర్వహించకపోవుటయు సోమరితనముగా చెప్పబడుచున్నది.

103) శోకము ఎట్లు గల్గుచున్నది ?

తనయొక్క అజ్ఞానము వలననే వ్యక్తి శోకతప్తుడగుచున్నాడు. అజ్ఞానమువలన అసలువిషయము గ్రహించలేకపోవుటయే శోకమునకు కారణము.

104) ఋషులు ఏది ఉత్తమమని చెప్పుచున్నారు ?

తన ధర్మములను తాను సక్రమముగా నిర్వర్తించుటయే ఉత్తమోత్తమమని ఋషులు చెప్పుచున్నారు.

105) శౌర్యము అననేమి ?

జ్ఞానేంద్రియములను నిగ్రహించగల్గుటయే శౌర్యము. విషయలోలత్వమున బడకుండుట, వ్యసనపరుడు

కాకుండుట మొదలుగాగలవి వ్యక్తి ధైర్యవంతుడని శౌర్యవంతుడని చెప్పుటకు వీలుకల్గించుచున్నవి.

106) ఉత్తమమైన స్నానము ?

మనోనిర్మలతయే ఉత్తమమైన స్నానము.

107) దానము—

సర్వసంపదలను తోటివారి శాంతి సౌభాగ్యముల కొఱకు ఉపయోగపరచుటయే దానము. అపాత్రులకు దానముచేయుట దానమని చెప్పవీలులేదు.

108) ఎవరు జ్ఞాని ?

సర్వధర్మములు తెలిసినవాడు జ్ఞాని. ధర్మములు నిర్వర్తించువాడు జ్ఞాని.

109) నాస్తికుడన నెవ్వడు ?

వస్తుగత ప్రపంచమును హేతువాదమును, మాత్రమే నమ్మగలిగినవాడు నాస్తికుడు.

110) ఎవరు మూర్ఖుడు ?

భగవంతుని నమ్మనివాడు మూర్ఖుడు. తన ధర్మమును విమర్శించువాడు మూర్ఖుడు. తన వ్యవస్థను విసర్జించినవాడు మూర్ఖుడు.

వస్తుగతవాది నాస్తికుడు. ఈ సకలచరాచర ప్రపంచమున కావలగల విషయులు అతనికి అనసరము.

అప్రస్తుతము. అందున నాస్తికుడు సంపూర్ణజ్ఞాని కాజాలకున్నాడు. అల్పజ్ఞాని మూర్ఖుడనియే చెప్ప వలసియున్నది. అందున ధర్మరాజు నాస్తికులను కూడా అల్పజ్ఞానులుగను, మూర్ఖులుగను ఎంచాడు.

111) ఏది వాంఛ !

జనన మరణాదులవలన సుఖ దుఃఖముల పాలగుచు సంసారసాగరమును మునిగి తేలుచు అట్టిసంసారమును మరలకోరుటయే వాంచ.

112) అసూయ—

యితరుల సంపదనుచూచి ఓర్వలేకపోవుటయే అసూయ.

113) అహంకారము—

పరిపూర్ణమగు అజ్ఞానమే అహంకారము.

114) ఏది ఉత్తమ ధర్మము ?

ధర్మసంస్థాపనాలోచన.

115) దైవత్వం దేనివలన సిద్ధించుచున్నది ?

దాన ధర్మములవలన దైవత్వం మానవునకు లభించు చున్నది.

116) ఏది మానవసహజం ?

ఇతరుల తప్పులు ఎంచుటయే మానవసహజం.

117) పైశున్య మనసేమి ?

యితరులయందుగల తప్పులను విశేషంగా ప్రచారం చేయుట, వెనుకగోతులు త్రవ్వుట.

118) ధర్మం, అర్థం, కామం అనునవి ఒకదానికి ఒకటి వ్యతిరిక్తములుకదా ! జగతిన యివి మూడునూ ఒకచోట ఒనగూడుచున్నవి.

భార్యవలన—

ధర్మం వలన భార్య, భార్యవలన కామం, కామం వలన పుత్రసంపద లభించుచున్నవిగదా !

విధేయురాలయిన భార్య, ప్రేమోద్దీప్తి గలిగించు భార్య, సుపుత్రునికన్న భార్యవలన పైమూడును ఒకచోట ఒనగూడుచున్నవి.

ఈప్రశ్నల వలననూ, అందుకు ధర్మరాజు యిచ్చిన సమాధానములవలననూ ఏంతోసమయం గడిచిపో యినది. సంధ్యాసమయం అయినందువలననూ, సాయంకాలపువిధులు నిర్వర్తించవలసి యున్నందు వలననూ, యుధిష్టరుని కోరికపై యక్షుడు, సంధ్య నిర్వర్తించుటకు మంచినీరు త్రాగుటకు అనుమతిం చాడు. అ తరువాత తిరిగి ఈవిధంగా ప్రశ్నించాడు.

1'9) ఎవరు నరకలోకమున చిరకాలం యుండగలరు ?

ధర్మరాజు ఈప్రశ్నకు ఈక్రింది విధంగా జవాబు యిచ్చాడు.

బీదబ్రాహ్మణుని ఆహ్వానించి ఆతనికి దానమీయక పంపువాడు చిరకాలం నరకమున యుండవలసి యుండును.

బ్రాహ్మణదానమును మరచిపోయినవాడు నరకవాసి యగుచున్నాడు.

వేదదూషణము, ధర్మశాస్త్రనింద, బ్రాహ్మణుల నవమానించుట మొదలుగాగల అకృత్యములవలన వ్యక్తి నరకవాసి యగుచున్నాడు.

అపారసంపదలుండియూ, దానధర్మములయందు ఆసక్తి చూపనివాడు చిరకాలం నరికమున యుండ వలసి యున్నది.

120) బ్రాహ్మణ్యము దేనివలన సిద్ధించి నిలచుచున్నది ?
ఓ మహాభాగా! యింతదనుకల్లా తామడిగిన ప్రశ్న లన్నింటికి సమాధానములు యివ్వడం జరిగింది. ఈ జవాబునుకూడ అవధరింపవలసినది.

కేవలం వేదాధ్యయనం వలనగాని వేదప్రవచనంవలన గాని, సంస్కారంవలనగాని బ్రాహ్మణ్యము అని పించుకొనదు సత్ప్రవర్తనె సదవగాహన, బ్రాహ్మ

ణ్యము అన్పించుకుంటుంది. ఉత్తముడైన బ్రాహ్మ ణునివలననే ప్రవర్తన సంరక్షింపబడు చున్నదను టలో ఎట్టిసందియమునూ లేదు.

ఉత్తమ బ్రాహ్మణుడు అన్పించుకొనుటకు ఈక్రింది లక్షణములు ప్రధానముగా ఎంచబడుచున్నవి. సత్ప వర్తన, సదవగాహన, అస్పృశ్యులాలఎడ సమాదరణ, నిరంతర వేదాధ్యయనము, బీదవిద్యార్థులకు విద్యా దాన మొనర్చుట, వ్యసనపరుడు కాకుండుట, నిత్యాగ్నిహోత్రము మొదలుగాగలవి.

121) మధుగభాషణములవలన వ్యక్తి ఏమిసంపాదించ గలుగుచున్నాడు?

మధురమయిన భాషణములవలననూ వ్యక్తి సర్వుల చేతనూ గౌరవింపబడుచున్నాడు.

122) తన అభిప్రాయములను నిస్సంశయముగా నిర్మొగ మాటముగా బయలుపరచినందున మనిషి ఏ లాభం పొందగలుగుచున్నాడు ?

నిస్సంశయముగా, నిర్భయముగా, నిర్మొహమాట ముగా మాట్లాడుట తాత్కాలికముగా కష్టము సంప్రాప్తమయిననూ అంతిమవిజయమును మనిషి తానే పొందగలుగుచున్నాడు.

123) స్నేహితులవలన లాభమేమి ?

పదిమంది స్నేహితుల వలన మనిషి తాను సుఖపడ గలుగుచున్నాడు.

124) ధర్మమును నిర్వర్తించినందువలన వ్యక్తి ఎట్లు లాభించగలుగు చున్నాడు ?

ధర్మనిర్వహణమువలన వ్యక్తి తనకు తానుగా సంస్కారియూ. స్వతంత్రుడునూ అగుచున్నాడు.

125) ఎవరు సంతోషి ?

తనకున్నదానితో సంతృప్తిచెందు మనిషి నిత్య సంతోషి.

126) అన్నిటికంటె వింత ఏది ?

పుట్టిన ప్రతిప్రాణి మరణించుట గమనించుచూ తాను మాత్రం నిత్యమనిఎంచుట అన్నిటికంటెనూ విచిత్రమయినదిగానూ, చెప్పబడుచున్నది.

127) ఏది సరైన మార్గము ?

తర్కము, తత్వము శాశ్వతములుకావు. శృతులు వేదములు, ఒకదానికొకటి భిన్నములు ఏ ఋషీ వాక్యము అధికార పూర్వముకాదు. తాను నమ్మినది ఆచరించుటయే సరైనమార్గము.

ధర్మజుని సమాధానములకు సంతుష్టుడయ్యాడు యక్షుడు. ఆఖరుప్రశ్న యిలా అడిగాడు.

128) ఎవరు సంపన్నుడు ?

భూమ్యాకాశములకు వ్యాపించిన కీర్తిగలవాడు మనిషి — పరిపూర్ణుడు. సుఖము, దుఃఖము భూత భవిష్యత్తులను ఒకేవిధముగా ఎంచినవాడునూ, తనకు గలిగినదానితో సంతృప్తి చెందినవాడునూ సంపన్నుడుగా చెప్పబడుచున్నాడు.

యక్షుడు సంతుష్టుడయ్యాడు. తిరిగి ధర్మరానుజులను పునర్జీవులను గావించాడు.

సమాప్తము